క్లుప్తంగా

నేటి నుంచి 'జీలుగ' పంపిణీ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏవో వసంత్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. 30కిలోల బస్తా ధర రూ.4,275 కాగా..యాభై శాతం సబ్సిడీపై రూ.2137.5 అందించనున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో ఏఈవోను సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో సమావేశమైన మిత్రులు

మామడ: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2003–04లో పదోతరగతి చదివిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. తరగతి గదులను చూసి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు కులశేఖర్, వెంకటేశ్వర్‌రావు, సురేశ్, లక్ష్మణ్, సంతోష్‌ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

అకాల వర్షంతో నష్టం



ఓలాలో నేలకొరిగిన వరి పొలం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి మళ్లీ అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న జొన్నలు, ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పుకొని జాగ్రత్తపడ్డారు. ఓలా గ్రామంలో కోతకు వచ్చిన వరిపంటలు నేలకొరిగాయి. ధాన్యం రంగు మారే అవకాశం ఉన్నందున ఆంక్షలు లేకుండా కొనాలని రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడకు చెందిన మధుకుమార్ రూ.60వేలు, సింధె సుధాకర్‌కు రూ.28,500, లస్మన్నకు రూ.10వేలు, సిందే మోహన్ రూ.60వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్, బీజేపీ నాయకులు చెన్న మహేశ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి సాయం



అభినయను అభినందిస్తున్న భీమ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినయను నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి బుధవారం తన నివాసంలో అభినందించారు. వచ్చే జూన్ 4వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు గోవా రాష్ట్రంలో జరిగే అండర్–17 జాతీయస్థాయి బాలికల బాక్సింగ్ పోటీల్లో అభినయ పాల్గొననుంది. ఈమేరకు భీమ్‌రెడ్డి.. క్రీడాకారిణికి రూ.10వేలను సాయంగా అందించారు.

డల్లాస్‌లో జాన్సన్‌నాయక్‌కు స్వాగతం

ఖానాపూర్: అమెరికాలోని డల్లాస్‌లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్‌కు ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు ఘనస్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ విభాగం ఆధ్వర్యంలో జూన్ 1న డల్లాస్‌లో నిర్వహించే తెలంగాణ అవతరణ, బీఆర్‌ఎస్ రజతోత్సవ ఉత్సవాలకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన జాన్సన్‌నాయక్‌కు ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికారు.

'బుద్ధ విగ్రహం పునఃప్రతిష్టించాలి'

భైంసాటౌన్: ముధోల్ మండలం రాళ్లబోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని వెంటనే పునఃప్రతిష్టించాలని విగ్రహ పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బస్టాండ్ ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడోరోజుకు చేరింది. భైంసా మండలం సిరాల గ్రామ బుద్ధ ఫాలోవర్స్, అంబేడ్కరిస్టులు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాళ్లబోరిగాంలో బుద్ధ విహార్ కోసం రెండెకరాలు కేటాయించాలన్నారు. బాధిత కుటుంబాలపై కేసులు ఎత్తివేసి.. ఎస్సీలపై దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దేవిదాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు రాజారాం, గిరిధర్ జంగ్మే, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మండి.. ఇది క్రీడా మైదానమే





తానూరు: క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామానికో క్రీడామైదానం ఏర్పాటు చేసింది. ఈ మైదానంలో ఉపాధిహామీ నిధులతో వ్యాయామ పరికరాలు, కబడ్డీ, ఖోఖో కోర్టులను ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ కరువై తానూరు మండలం వడ్‌గాం పంచాయతీ పరిధి కుప్టి గ్రామ మైదానం పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. దీంతో క్రీడాకారులు, వ్యాయామం చేసేవారు ఇటువైపు తొంగిచూడటం లేదు.

సాగు సంబురం షురూ..



విత్తనాలు విత్తుతున్న రైతులు

కుంటాల: ఈసారి మే మాసంలోనే మృగశిర కార్తెకు ముందే రుతుపవనాలు వచ్చేశాయి. దీంతో ఖరీఫ్‌లో పంటల సాగు కోసం భూములను సిద్ధం చేశారు. ఇటీవలి వర్షాలకు కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామ రైతులు బుధవారం పత్తి విత్తనాలు విత్తుతూ బిజీబిజీగా కనిపించారు.

గుంతల రోడ్డుపై ప్రయాణమెలా..



భైంసారూరల్: ఇటీవలి వర్షాలకు భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మండలంలోని సిద్దూర్ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతల్లో నీరు నిలువడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై నిరసన

- డీసీవో హామీతో శాంతించిన రైతులు



ముఠాపూర్‌లో కాలుతున్న కొనుగోలు కేంద్రం ఫ్లెక్సీ బోర్డు



రైతులతో మాట్లాడుతున్న అధికారి పాపయ్య

నిర్మల్‌రూరల్: మండలంలోని ముఠాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ప్రైవేటు వ్యక్తులు పంటను కొంటున్నారని.. దీంతో తాము నష్టపోతున్నామని బుధవారం రైతులు నిరసనకు దిగారు. గ్రామానికి చెందిన శ్రీధర్ అనే రైతు కొనుగోలులో జాప్యానికి నిరసనగా తన రెండు బస్తాల వరి ధాన్యాన్ని తగులబెట్టేందుకు యత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో కొందరు రైతులు కార్యాలయం ముందు ఉన్న ఫ్లెక్సీలను ఒక చోట చేర్చి నిప్పు అంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసి జిల్లా కోపరేటివ్ అధికారి పాపయ్య కొనుగోలు కేంద్రానికి చేరుకొని రైతులను సముదాయించారు. ధాన్యాన్ని తూకం వేసి రైతుల ఇబ్బందులు తీరుస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

పంచగుడి రోడ్డుపై రైతుల ధర్నా

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఇదే మండలంలోని వట్టోలి గ్రామ రైతులు ధర్నా చేశారు. ధర్మోర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి.. పలు గ్రామాల రైతులతో ఒప్పందం కుదుర్చుకొని యాసంగిలో బాస్మతి(సీడ్) ధాన్యం సాగు చేయించాడు. కంపెనీ సూచించిన ప్రమాణాలు పాటిస్తూ పంట పండించారు. తీరా ఇద్దరు రైతుల పంటను కొనమని సదరు వ్యక్తి చెప్పడంతో ధర్నాకు దిగారు. ఈ విషయం తెలిసి ఎస్సై అశోక్ అక్కడకు వెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

- భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి



మాట్లాడుతున్న భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి

భైంసారూరల్: గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అధికారులు అవగాహన కల్పించాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైద్యశాఖ, పంచాయతీ, తదితర శాఖల అధికారులతో వ్యాధుల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని ఇళ్లను సందర్శించి.. పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఇంట్లో వడిన తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. దోమల కట్టడికి ఫాగింగ్ చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యాధికారులు శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, వైద్యాధికారి ఆనంద్, పశువైద్యాధికారి విఠల్, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తానూరు: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ లింగంమూర్తి, సూపర్‌వైజర్ అబ్దుల్ కాసీం, ఈజీఎస్ ఏపీవో శివలింగం, అధికారులు తదితరులు ఉన్నారు.

మామడ: గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి రాజనర్సయ్య అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, వైద్యాధికారి శ్రీకాంత్, ఏఓ సంధ్య, విఠల్, ఏఈ క్రాంతి ఉన్నారు.

లోకేశ్వరం: వర్షాకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ సర్ఫరాజ్ హైమద్, ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, ఏపీఎం మల్లేశ్, ఏపీవో జగన్నాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రసాద్, వాటర్ గ్రిడ్ ఏఈ సుమన్, వైద్యాధికారి రవీందర్ ఉన్నారు.

లక్ష్మణచాంద: ప్రజలు అనారోగ్యానికి గురైతే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని లక్ష్మణచాంద పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధ అధ్యక్షతన అధికారులకు సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. మల్లాపూర్ ఆరోగ్య ఉపకేంద్రంలోనూ డాక్టర్ అందుబాటులో ఉన్నాడని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో.. కార్యదర్శులను ఆదేశించారు. వద్యాల్‌తండాలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై ఆరా తీశారు. తహసీల్దార్ సరిత, ఎంపీవో అమీర్ ఖాన్, ఆర్‌ఐ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో సాగర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు. తహసీల్దార్ శివరాజ్, డాక్టర్ విజయ్, ఎంపీవో మోహన్ సింగ్, ఏవో సారిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, సీడీపీవో రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులు, కార్యదర్శులు, వైద్యశాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎంపీడీవో సునీత, తహసీల్దార్ సుజాత, ఎంపీవో రత్నాకర్‌రావు, సీడీపీవో సరిత ఉన్నారు.

గ్రామపంచాయతీకి స్థలమిచ్చిన దంపతులు

సారంగపూర్: మండలంలోని అడెల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఇదే గ్రామానికి చెందిన తాండ్ర రాజేశ్వర్–లక్ష్మమ్మ అనే దాతలు తమ భూమిని విరాళంగా అందజేశారు. ఈమేరకు బుధవారం తమ భూమిని పంచాయతీ భవనానికి విరాళంగా ఇస్తున్నట్లు తయారు చేయించిన దస్తావేజులను గ్రామానికి వచ్చిన ఎంపీవో అజీజ్‌ఖాన్‌కు అందజేశారు. రాజేశ్వర్–లక్ష్మమ్మ దంపతులను ఎంపీఓ సత్కరించారు. కార్యక్రమంలో డీటీ రవీందర్, అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, శేఖర్‌గౌడ్, సాయన్న, రాము, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

నేటి వ్రతానికి భక్తులు రావాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని గండి రామన్న దత్తసాయి ఆలయ ప్రాంగణంలో గురువారం సామూహిక శ్రీదత్త అనఘా వ్రతం నిర్వహించనున్నట్లు శ్రీ సాయిదీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మైసూర్ దత్తపీఠం గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే భక్తులు, దంపతులు పూలు, పండ్లు, వ్రత సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

- ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి

దస్తురాబాద్: నేరాల నియంత్రణకే పోలీసులు కమ్యూనిటీ కాంటాక్టు(కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆకొండపేట గ్రామంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 62 బైక్‌లకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. లైసెన్సు లేనివారు విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు.. తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని.. ఏవైనా అనుమానాలుంటే పోలీసులను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్సైలు కృష్ణసాగర్‌రెడ్డి, సాయికృష్ణ, ఏఎస్సైలు లక్ష్మీనారాయణ, మాన్‌సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జంబి గద్దె స్థలం కాపాడాలి'

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేసిన పునరావాస కాలనీ పక్కన ఉన్న జంబి గద్దె స్థలాన్ని కాపాడాలని పలువురు కొత్తమద్దిపడగ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ వందల ఏళ్ల నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని.. జంబి గద్దె స్థలం అందిరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు దుల్లె వెంకటేశ్, సకినాల ప్రవీణ్, జడ రాజేందర్, గంగాధర్, మార్కపు గంగన్న, దుర్గం గంగరాజం, రమేశ్, మక్కి రాజన్న, రాజన్న, సాగర్ తదితరులు ఉన్నారు.

పాలాభిషేకం

ఖానాపూర్: ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఖానాపూర్ నియోజకవర్గానికి కేటాయించినందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, నిమ్మల రమేష్, మాజిద్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, తోట సత్యం, షబ్బీర్ పాషా, గంగనర్సయ్య, గంగాధర్, గోవింద్, సత్యనారాయణ, లక్ష్మీరాజం, సంతోష్, అశోక్, రమేష్ తదితరులు ఉన్నారు.

నేనే సర్పంచ్.. నాదే సీటు



కడెం: 'నేనే సర్పంచ్.. ఈ సీటు నాదే' అన్నట్లు ఓ కుక్క మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని సర్పంచ్ కుర్చీలో దర్జాగా కూర్చుంది. స్థానికులు కొందరు వీడియో తీయడంతో ఇది బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



అవగాహన కల్పిస్తున్న సాయిరెడ్డి

మామడ: పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం సమకూరుతుందని పౌల్ట్రీ రీసెర్చ్ స్టేషన్ హెడ్ వైద్యాధికారి సాయిరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటపూర్ గ్రామంలో బుధవారం పి.వి.నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకంలో మెళకువలు అనే అంశంపై గిరిజనులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రోజు కోడిగుడ్లు తింటే ఆరోగ్యంగా ఉంటామని.. కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు గుర్రం శ్రీనివాస్, మహేశ్, అబ్దుల్ శరియన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అటవీ అధికారుల దౌర్జన్యం సరికాదు'



పొక్లెయిన్ తవ్వకాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: రైతులు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ అధికారులు మొక్కలు నాటేందుకు పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టి దౌర్జన్యం చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలో భూమన్న, నర్సయ్య అనే రైతుల భూముల్లో చేపట్టిన ట్రెంచ్ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోడుభూమిలో జేసీబీ తవ్వకాలను అడ్డుకున్న రైతులను ఎఫ్‌ఆర్‌వో కిరణ్‌కుమార్, డీఆర్‌వో మహేశ్, ఎఫ్‌ఎస్‌వోలు రవీందర్, కుతుబుద్దీన్, శ్రీనివాస్, సదాశివ్, రత్నయ్య, ఎఫ్‌బీలు జీపులో తరలించేందుకు యత్నించగా నాయకులతోపాటు రైతు కుటుంబీకులు ఆందోళనకు దిగారు. అయినప్పటికీ అధికారులు తవ్వకాలు చేపట్టారు. నాయకులు డాకూరి తిరుపతి, తొడసం శంభు, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీఐఓ



పీహెచ్‌సీలో వ్యాక్సిన్లు పరిశీలిస్తున్న అధికారి

సారంగపూర్: గడువులోగా చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నయనారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సారంగపూర్ పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. వ్యాక్సిన్లు నిల్వ చేసే రిఫ్రిజిరేటర్‌ను పరిశీలించారు. గ్రామాల వారీగా టీకాలు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ధని, చించోలి(బి) ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించారు. అక్కడ టీకాలు అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. వైద్యాధికారి అబ్దుల్ వాజీద్, పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, ప్రేమ్‌సింగ్, ఫార్మసిస్టు సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలించాలి

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సోఫినగర్ బాలికల పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై జిల్లాలోని కేజీబీవీ, టీజీ ఆర్‌ఎస్, టీఎస్ ఎంఎస్‌యూఆర్‌ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ శిక్షణను ఇన్‌చార్జి డీఈఓ, పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ ప్రారంభించి మాట్లాడారు. మానవులను ఒక వస్తువుగా చూస్తూ, వారిని అక్రమంగా విదేశాలకు రవాణా చేస్తూ బానిసలుగా మారుస్తున్నారని అన్నారు. ఇలాంటి అక్రమ రవాణాను నివారించాలని పేర్కొన్నారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డెనియల్, ఏఎంఓ నరసయ్య, కోర్సు బాధ్యులు రమాదేవి పాల్గొన్నారు.

హెచ్‌ఎంల శిక్షణ శిబిరం పరిశీలన

జిల్లాకేంద్రంలోని నారాయణ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని బుధవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుల నాయకత్వ లక్షణాలు, బాధ్యతలు, ఉపాధ్యాయులతో సమన్వయం తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, ఆన్‌లైన్ నివేదికలు పొరపాట్లు లేకుండా నివేదిక తయారు చేయాలని సూచించారు.

రోడ్డు కోసం ఖత్‌గాంవాసుల ధర్నా



బైఠాయించిన ఖత్‌గాం గ్రామస్తులు

భైంసాటౌన్: తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని మండలంలోని ఖత్‌గాంవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఖడ్డా హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ డెగ్లూర్ రాజు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి రూ.99లక్షలు మంజూరయ్యాయని.. టెండర్ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో సీఐ గోపినాథ్ వెళ్లి వారిని సముదాయించారు. అనంతరం అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకోగా గుత్తేదారుతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

మినీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

మామడ: మండలకేంద్రంలోని గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశం పొందేందుకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ఆ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నీల ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30 సీట్లు, ఐదో తరగతిలో 5 సీట్లు అందుబాటులో ఉన్నాయని.. వచ్చే నెల ఆరో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

తీరిన దారి సమస్య



కల్వర్టుపై కూర్చొని గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

ఖానాపూర్: మండలంలోని కొలాంగూడ పంచాయతీ పరిధి కుసుంపూర్ గ్రామంలో గూడెం నుంచి పాఠశాలకు వెళ్లే మార్గంలో ఉపాధి నిధులు రూ.రెండు లక్షలతో వరద వచ్చే ఒర్రె ప్రాంతంలో ఇటీవల కల్వర్టు నిర్మించారు. దీంతో విద్యార్థులతోపాటు గ్రామస్తులకు రోడ్డు సమస్య తీరింది. బుధవారం కల్వర్టు నిర్మించిన ప్రాంతాన్ని డీఆర్‌డీవో విజయలక్ష్మి సందర్శించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో గ్రామంలో సమస్యల పరిష్కారానికి పాటుపడతానని డీఆర్‌డీవో గ్రామస్తులకు భరోసానిచ్చారు.